క్లుప్తంగా

వర్షం కోసం దర్గాలో ప్రార్థనలు

హొళగుంద: స్థానిక సాయిబన్న దర్గాలో వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు, గ్రామస్తులు బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు స్థానిక ఎల్లెల్సీ కాలువ నుంచి 101 బిందెల నీరు తెచ్చి సాయిబన్న సమాధిపై పోశారు. స్థానిక తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) వద్ద, దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు చేశారు.

కర్ణాటక మద్యంపై ప్రత్యేక నిఘా

ఆలూరు: కర్ణాటక మద్యం రవాణ, విక్రేతలపై ప్రత్యేకంగా నిఘా వేసి చర్యలు తీసుకుంటామని ఆలూరు సెబ్ సీఐ ఎర్రవెంకట్ తెలిపారు. స్థానిక సెబ్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హొళగుంద, హాలహర్వి మండలాల్లోని గ్రామాల్లో ప్రత్యేకంగా కర్ణాటక విక్రయదారులపై విస్తృతంగా దాడులు చేస్తున్నామన్నారు. అక్రమ మద్యం రవాణ, విక్రయాలపై సెల్ నంబర్ 63027386 కు సమాచారాన్ని అందించాలని కోరారు.

25 నుంచి చింతలముని, నల్లారెడ్డి స్వాముల ఉత్సవాలు




తంగరడోణలో కొలువైన చింతలముని, నల్లారెడ్డి స్వామి

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు చింతలముని, నల్లారెడ్డి దశమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పార్వతి గురువారం తెలిపారు. ఆలయాలలో 25న గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు, 26న స్వాముల వారి గుర్రం ఊరేగింపు, ప్రత్యేక పూజలు, 27న ఉత్సవాలు ముగింపు కార్యక్రమం సందర్భంగా బలిదానం ఉంటుందన్నారు. స్వాములను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

పొలం గట్టు విషయంలో ఘర్షణ



గాయపడిన వెంకటేష్

తుగ్గలి : పొలం గట్టు విషయమై సర్ది చెప్పేందుకు వెళ్లిన శభాష్‌పురం ఉప సర్పంచ్ నారాయణమ్మ భర్త ఇంద్రంపల్లి వెంకటేష్ రాళ్ల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. బాధిత వర్గీయులు తెలిపిన వివరాల మేరకు.. పీసీకొండకు చెందిన చెన్నయ్య, పందికోన కృష్ణమూర్తి అలియాస్ కిట్టు గురువారం పొలం గట్టు విషయమై వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. గొడవ పడకుండా సమస్య పరిష్కరించుకోవాలని సర్దిచెప్పేందుకు వెళ్లిన వెంకటేష్‌పై శభాష్‌పురం నుంచి వచ్చిన టీడీపీ నాయకుడు ఆదినారాయణ తన మనుషులతో కలిసి రాళ్లతో దాడి చేసినట్లు ఆరోపించారు. దాడిలో మధ్యవర్తి వెంకటేష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితున్ని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. దాడికి సంబంధించి కృష్ణమూర్తి, ఆదినారాయణతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు జొన్నగిరి ఎస్ఐ రామాంజినేయులు తెలిపారు.

వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేసుకోండి

హాలహర్వి : వైఎస్సార్ చేయూతకు పథకానికి 45 సంవత్సరాలు నిండిన మహిళలు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఆంథోని సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో పథకం కింద లబ్ధి పొందుతున్న మహిళలు మరలా పథకానికి అవసరమైన పత్రాలను సమర్పించి అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్ల ద్వారా ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని సచివాలయాన్ని సందర్శించాలన్నారు.

రైతుభరోసా కేంద్రాల తనిఖీ

హాలహర్వి : మండలంలోని గూళ్యం గ్రామంలోని ఒకటి, రెండు, మూడు రైతుభరోసా కేంద్రాలను గురువారం ఏఓ శివశంకర్ తనిఖీ చేశారు. ఈ సీజన్‌లో వేసిన పంటలను జియో ట్యాగ్ ద్వారా ఈ క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఏఓ రైతులకు సూచించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్ అసిస్టెంట్ మనోజ్ పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో ముద్దాయిల అరెస్ట్

తుగ్గలి : మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో మహిళపై జరిపిన లైంగిక దాడి కేసుకు సంబంధించి ముద్దాయిలను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీసీఎస్ డీఎస్పీ శ్రీనివాసులు సమక్షంలో ఎస్ఐ మల్లికార్జున అరెస్ట్ వివరాలను తెలిపారు. ఎద్దులదొడ్డిలో పది రోజుల క్రితం ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన బోయ పందికోన రామానాయుడు, ఈడిగ ఉపేంద్రగౌడ్ బలవంతంగా లైంగిక దాడికి పాల్పడడమే కాకుండా ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి వాట్సాప్‌లో పోస్టు చేశారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- అన్ని వర్గాలకు ప్రభుత్వ ఫలాలు అందించిన సీఎం జగన్
- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

హొళగుంద: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తుందని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని సామాజిక వర్గాలకు ప్రభుత్వ ఫలాలు అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో సర్పంచ్ కురువ చాముండేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా ఆధ్వర్యంలో గురువారం ' గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు కార్యక్రమానికి హాజరైన మంత్రి గుమ్మనూరుకు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. కురిపిస్తూ డప్పువాయిద్యాల మధ్య పూల వర్షం గ్రాస్తులు మంత్రిని స్వాగతించారు. తన సోదరుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు నారాయణస్వామితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు.



మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు ప్రభుత్వ పథకాలు వర్తించాయా... లేదా అని మంత్రి లబ్ధిదారులను ఆరా తీయగా అందరూ లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని, మారుమూల గ్రామాలకు సైతం సకల మౌలిక వసతులు కల్పిస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన ధ్యేయంగా ఉన్న ఊర్లోనే సకల సేవలు అందజేస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఇదే విధంగా ప్రజల వద్దకు పాలన సాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. అనంతరం సోదరుడితో కలిసి శేక్షావలి, షాషావలి దర్గాలను దర్శించుకున్నారు. దర్గాల్లో చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ఫాతెహాల్ సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు, ఎంపీపీ తనయుడు ఈశా, సర్పంచ్ కురువ చాముండేశ్వరి,



ఎల్లార్తి షేక్షావలి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు చేస్తున్న మంత్రి, ఆయన సోదరుడు

స్థానిక నాయకులు ఎస్కే గిరి, దర్గన్న, ఈరన్న, కోగిలతోట శేషప్ప, మల్లికార్జున, లక్ష్మీకాంత్, వెంకటేష్, ఎంపీటీసీలు మల్లికార్జున, కెంచప్ప, జిల్లా కమిటీ సభ్యుడు ప్రహ్లాదరెడ్డి, వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హనుమప్ప, మేలగిరి, లక్ష్మీకాంతరెడ్డి, రంగప్ప, చంద్ర, మౌనేష్, మాజీ జెడ్పీటీసీ రాంభీంనాయుడు, ఆయా శాఖలధికారులు పాల్గొన్నారు.

ఎల్లార్తి గ్రామానికి రూ. 16.42 కోట్లు ఖర్చు

గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఒక్క ఎల్తారి గ్రామానికి మూడేళ్లలో వివిధ పథకాల ద్వారా రూ.16.42 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని

జనవరి 1 నుంచి పింఛన్ రూ.3 వేలు

అవ్వ,తాతలకు, వితంతువులకు ప్రతి నెలా 1వ తేదీన ఇస్తున్న రూ.2,750 పింఛన్‌ను సీఎం జగనన్న 2024 జనవరి నుంచి రూ.3 వేలుకు పెంచి అందజేస్తారని మంత్రి గుమ్మనూరు స్పష్టం చేశారు. పింఛన్ తీసుకోవడానికి కూడా అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతువులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన జగనన్న వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ఇంటి వద్దనే అందజేస్తున్నారని గుర్తు చేశారు. గతంలో పింఛన్ మంజూరు పడరానిపాట్లు పడాల్సి ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. అర్హత ఉంటే చాలు వలంటీర్‌ను సంప్రదిస్తే నేరుగా సచివాలయానికి తీసుకెళ్లి పింఛన్ దరఖాస్తు చేయిస్తారని, నిబంధనల మేరకు ఎవరి సిఫారసు లేకుండా పింఛన్ మంజూరు అవుతుందని వివరించారు.

మంత్రి గుమ్మనూరు జయరాం గుర్తు చేశారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు గొప్పగా చెప్పుకోవడానికి కనీసం ఒక్క పథకమైనా ఉందా అని ప్రశ్నించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి.... మనువడిగా, ఓ అన్నగా, ఓ తమ్ముడిలా ప్రజలకు సేవలందిస్తున్నారని, మహిళా సాధికారతే లక్ష్యంగా చేయూత, ఆసరా, అమ్మ ఒడి, సున్నా వడ్డీ లాంటి పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. అదేవిధంగా గ్రామంలోని ఎస్సీ కాలనిలో ఉన్న కందారమ్మ ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ.50 వేలును విరాళంగా ఇస్తున్నట్లు మంత్రి గుమ్మనూరు జయరాం కాలనివాసులకు హామీ ఇచ్చారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం

తాగునీటి సమస్యను వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్కే గిరి మంత్రి దృష్టికి దృస్టికి తీసుకి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి జేజేఎస్ నిధులు రూ.56 లక్షలతో పాటు సచివాలయానికి ఇచ్చే రూ.20 లక్షలను తాగునీటి సమస్య పరిస్కారానికి, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు వాడుకోవాలన్నారు. అందుకు అవసరమైన ప్రతి పాదనాలను తయారు చేయాలని అధికారులకు, నాయకులకు సూచించారు.

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు



దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న మలేరియా ఆఫీసర్, వైద్యులు

మద్దికెర : దోమలు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మలేరియా అధికారి వైద్యశాలను తనిఖీ చేశారు. అనంతరం మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో దోమలు వ్యాప్తి చెందకుండా డీడీటీ 50 % మందును ప్రతి ఇంటికీ పిచికారీ చేయించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల బారిన పడకుండా దోమతెరలు వాడాలన్నారు. దోమకాటు ప్రమాదకరమైందని, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదముందన్నారు. రోజుల తరబడి జ్వరం వుంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ వైద్యసిబ్బంది వెంకటేశ్వర్లు, అక్బర్‌బాషా, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

దేవనకొండ : మండలంలోని బంటుపల్లె గ్రామంలో దోమల నివారణకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రలేఖ, మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. గురువారం గ్రామంలో డీడీటీ 50 శాతం మందును పిచికారీ చేయించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్ గ్రామాన్ని సందర్శించి దోమల వల్ల కలిగే వ్యాధులు, నివారణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాధాభాయి, సూపర్‌వైజర్ శ్రీధర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పత్తికొండలో నేడు జాబ్‌మేళా

పత్తికొండటౌన్: పత్తికొండ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 18వతేదీ శుక్రవారం స్థానిక నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి తెలిపారు. టాటా ఆల్‌సెక్, స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరై నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు విద్యార్హతల సర్టిఫికెట్లతో నేరుగా జాబ్‌మేళాకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పైపులైన్ పనులు పరిశీలన

మద్దికెర : మండల పరిధిలోని హంప గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన పైపులైను పనులను జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యలను పరిష్కరించాలని చాలా కాలంగా ప్రజలు కోరుతున్నారని, దీంతో ప్రత్యేకంగా పైపులైను వేసి నీటిని అందించడం జరుగుతుందన్నారు. ప్రజలు గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ తాలూరు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

ఆలూరు రూరల్: విద్యుత్ వినియోగదారులు బిల్లులను సకాలంలో చెల్లించాలని ఆలూరు విద్యుత్ ఏఈ లోకేష్ సూచించారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గడువులోగా విద్యుత్ బిల్లును చెల్లించి సంస్థకు సహకరించాలన్నారు. అలాగే పెండింగ్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సంబంధిత లైన్‌మెన్ లేదా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వ్యవసాయ బోరు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ట్రాన్స్‌ఫార్మర్లను సీనియారిటీ ప్రకారం అందిస్తామని, రైతులు దళారులను ఆశ్రయించవద్దని సూచించారు.

'నాడు - నేడు' పనుల పరిశీలన

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్, ఎర్రకోట, కోటేకల్ గ్రామాల్లో జిల్లా పరిషత్ పాఠశాలల్లో 'మనబడి నాడు-నేడు' కింద చేపట్టిన భవన నిర్మాణాలను గురువారం డీఈఓ రంగారెడ్డి పరిశీలించారు. భవన నిర్మాణాలు ఆలస్యం కావడానికి గల కారణాలను ఉపాధ్యాయులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఈఓ మాట్లాడుతూ పాఠశాల గదుల నిర్మాణాలు త్వరితిగతిగా పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. నిర్మాణాల్లో ఏమైన సమస్యలంటే తమ దృష్టికి తీసుకువస్తే ఇదే విషయం జిల్లా కలెక్టర్‌కు తెలియజేసి పరిష్కరిస్తామని చెప్పారు.



గుడేకల్ జెడ్పీ హైస్కూల్‌లో పనులను పరిశీలిస్తున్న డీఈఓ రంగారెడ్డి

సంక్షిప్తం

నిలిచిన ఆధార్ సేవలు

మద్దికెర : ప్రభుత్వం సకాలంలో ప్రభుత్వ సేవలతో పాటు ఆధార్ కేంద్రాలను సచివాలయాలలో ఏర్పాటు చేసింది. అయితే గత పది రోజులుగా ఆధార్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రతి ప్రభుత్వ పథకానికి ఆధార్ కార్డు అవసరం. ఆధార్ కేంద్రానికి వస్తున్న గ్రామీణులకు పనిచేయకపోవడంతో నిరాశగా వెనుదిరిగి పోతున్నారు. ఈవిషయంపై సంబంధిత డిజిటల్ అసిస్టెంట్ వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లగా సేవలు నిలిచిపోయిన విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేశామని, త్వరలోనే తిరిగి సేవలు అందిస్తామన్నారు.

పరామర్శ

తుగ్గలి : లైంగిక దాడికి గురైన బాధిత మహిళ కుటుంబాన్ని గురువారం తహసీల్దార్ రవి పరామర్శించారు. ఎద్దులదొడ్డికి వెళ్లి బాధిత కుటుంబంతో మాట్లాడారు. నిత్యావసర సరుకులు అందజేశారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ సుధాకరరెడ్డి, వీఆర్వో కాశీ రంగస్వామి ఉన్నారు.

ముగిసిన ఉప ఎన్నికల ప్రచారం

వెల్దుర్తి: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె, ఎల్ నగరం (పిక్కిలివానిపల్లె)లలో పంచాయతీ వార్డు మెంబర్ల ఉప ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రం ముగిసింది. బొమ్మిరెడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన 3వవార్డు మెంబరు మృతి చెందడంతో ఆ స్థానానికి మృతుని కుటుంబీకురాలు తలారి బోయ ఎల్లమ్మ పోటీ చేస్తున్నారు. ఎల్ నగరం పంచాయతీ పిక్కిలివాని పల్లెలోను వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన 2వవార్డు సభ్యుడు మృతి చెందడంతో నిర్వహిస్తున్న ఎన్నికలో మృతుని కుటుంబీకుడు సక్క లోకేశ్ పోటీలో ఉన్నాడు. ఈ రెండు చోట్ల ఆనవాయితీకి విరుద్ధంగా బలం లేకపోయినా నామ్‌కే వాస్తే అన్నట్లుగా ప్రతిపక్ష టీడీపీ నాయకులు తమ మద్దతుదారులను ఇతర వార్డులు, ఇతర మజారా గ్రామాల నుంచి తీసుకువచ్చి పోటీలో నిలబెట్టారు. బొమ్మిరెడ్డిపల్లెలో ప్రచారం ఇరుపార్టీల అభ్యర్థులు హోరాహోరీగా నిర్వహించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయండి

ఆలూరు: నియోజకవర్గ కేంద్రం ఆలూరులో ప్రభుత్వ డిగ్రీకళాశాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు సంతకాలు సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష్య, కార్యదర్శి లక్ష్మినా రాయణ, పోతురాజు మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల గత కొన్నేళ్లు నుంచి స్వంత భవనాలను ఏర్పాటు చేయకపోవడంతో జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన గదులలోనే డిగ్రీ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలోనాయకులు మైనా, గిరిమూర్తి, ఉలిగిరాజ్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులున్న మందులనే విక్రయించాలి

దేవనకొండ : మండలంలోని ఫర్టిలైజర్ షాపుల డీలర్లు ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, పురుగుల మందులనే విక్రయించాలని ఏడీఏ మోహన్ విజయకుమార్ సూచించారు. గురువారం ఏఓ సురేష్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో డీలర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పెస్టిసైడ్స్ కోసం గోడౌన్ ఇన్‌క్లూషన్స్ ప్రతి ఒక్క డీలర్ చేసుకోవాలన్నారు. ఫర్టిలైజర్ కోసం ఓ ఫామ్ అండ్ గోడౌన్ ఇన్‌క్లూషన్స్ సరిగా లేకపోతే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

గోనెగండ్ల : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత రైతులకు సూచించారు. గురువారం మండలంలోని ఎర్రబాడు, నెరుడుప్పల, కున్నూరు గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే పత్తి పంటలను పరిశీలించి, రసం పీల్చే పురుగులు ఆశించినట్లు గుర్తించారు. , వీటి నివారణకు డైపెంథూరియాన్ ఒక గ్రాము లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్లలో ఒక లీటర్ నీటిని కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు.

చిప్పగిరి: ఈ క్రాప్ బుకింగ్ (పంటల నమోదు) తప్పని సరిగా చేసుకోవాలని ఏడీఏ సునిత రైతులకు సూచించారు. గురువారం మండలంలోని నగరడోణ గ్రామంలో ఏఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.



పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత

కృష్ణగిరి: రైతులు ప్రభుత్వం నుంచి ఏదీ పొందాలన్నా వారు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఏఓ ఎస్. వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని ఎస్‌హెచ్‌ఎర్రగుడి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును గురువారం ఆయన పరిశీలించారు.

పశువులకు లంపీ స్కిన్ టీకాలు

నందవరం : మండల కేంద్రంలో గురువారం నరేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పశువులకు లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ లంపీస్కిన్ వ్యాధి కారణంగా పశువులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉందన్నారు. రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

కృష్ణగిరి: మండలంలోని పోతుగల్లు గ్రామానికి చెందిన బోయ కొసనాపల్లె రామకృష్ణ అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మృతునికి భార్య రాజేశ్వరికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10వేలను సచివాలయ కన్వీనర్ తెలుగు వెంకటేష్, బేతాపల్లె సుధాకర్, సచివాలయ వేల్ఫేర్ అసిస్టెంట్ వెంకటస్వామితో కలిసి అందజేశారు.

గ్రామ కంఠం పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వెంకటాపురం కాలనీలో ఉన్న గ్రామ కంఠం భూమిని గురువారం తహసీల్దార్ ఆంజినేయులు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఆ భూమిని సర్వే చేయడం జరిగిందని కమిషనర్ తెలిపారు. కాగా, ఆస్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి హక్కు పత్రాలు అందజేయాలని కౌన్సిలర్ బజారి అధికారులను కోరారు.

హస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: సంక్షేమ హస్టళ్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు కోరారు. గురువారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హస్టల్ విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలను మంజూరు చేయాలన్నారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గానికి అధ్యక్షులుగా వీరేంద్ర, కార్యదర్శిగా వీర ప్రతాప్‌లతో పాటు 20 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

తాగు నీటి సమస్యను పరిష్కరించండి

చిప్పగిరి: తాగు నీటి సమస్యను పరిష్కరించాలనిదౌల్తాపురం గ్రామ మహిళలు సచివాలయం ఎదుట బిందెలతో నిరసన తెలిపారు. సుంకలమ్మ కట్టకు దిగువున ఉన్న ఎస్సీ, బీసీ కాలనీలకు రెండు నెలలుగా నీరు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పంచాయితీ కార్యదర్శి సుదీర్ దృష్టికి తీసుకెళ్లగా మోటారు మరమ్మతులకు గురైనందున కొన్ని కాలనీలకు నీరు చేరడం లేదని, రెండు రోజులలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

భూముల కబ్జాకు టీడీపీ నాయకుల పన్నాగం

కృష్ణగిరి: గ్రామాల్లో టీడీపీ నాయకులు భూములు కాజేసేందుకు పన్నాగం పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చుంచుఎర్రగుడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రకాష్‌గౌడ్ ప్రభుత్వ భూములను అక్రమించడమే కాకుండా ఇతరుల పేరున ఉన్న స్థలాలను కూడా కాజేసేందుకు పూనుకున్నారన్నారు. గ్రామంలోని 338 సర్వే నెంబర్‌లో ఇతని భార్య పేరు మీద 19సెంట్ల స్థలం ఉంది. ఈ స్థలం ఈ సర్వే నెంబర్‌లో నాలుగుచోట్ల ఉంది. కానీ ఈ స్థలం పక్కన ఉన్న బోయ రామాంజినమ్మ, శిరోల్ల రామలింగడు, మహేశ్వరితోపాటు మరో ఆరుగురు పేరున ఉన్న స్థలాలు కూడా నావే అంటూ దౌర్జన్యానికి దిగుతున్నారని చెప్పారు. అలాగే ఇతను గతంలో 442 సర్వే నెంబర్‌లో 31సెంట్లు, 443లో 75సెంట్ల ప్రభుత్వ స్థలాలను అక్రమించాడని తెలిపారు. అలాగే శేఖర్‌గౌడ్ అనే వ్యక్తి ప్రస్తుతం అనంతపురం జిల్లాలో వాటర్‌షెడ్‌లో పీఓ పనిచేస్తూ గ్రామంలో రాజకీయం చేయడం జరుగుతుందన్నారు. ఇతని కూడా 640/1లో శివాజయం భూమిని తన కుటుంబసభ్యుల పేరున ఎక్కించుకోవడం జరిగిందన్నారు. వెంట బాల వెంకటరాముడు, మల్లికార్జున తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

తుగ్గలి : జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని సర్పంచ్ గూడూరు రాచప్ప, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ విజయమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం రాతనలో వారు రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులకు ఎంతో కాలం సమస్యగా ఉన్న భూములకు సైతం రీ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు తమ భూ హక్కు పత్రాలను సర్వే అధికారులకు చూపించి సహకరించాలని కోరారు. వీఆర్వోలు నాగేంద్ర, రంగప్ప, సర్వే బృందం పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు
- వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేరవేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బోడబండ గ్రామంలో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సాయంత్రం నుంచి రాత్రి వరకు విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల ప్రకారం సంక్షేమ పథకాలు అందాయా.. లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వనివి కూడా అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యనిస్తూ సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని, విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారని, నాణ్యమైన పుస్తకాలు, దుస్తులు, విద్యా బోధన అందిస్తున్నారని వివరించారు. పిల్లలను బడికి పంపే ఏ తల్లీ ఇబ్బంది పడకూడదని అమ్మఒడి, విద్య, వసతి దీవెనలు అమలు చేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామంలో రైతులకు విత్తనాలు, ఎరువులు, రసాయన మందులు అందేల చూస్తున్నారన్నారు. ప్రతి నెలా 1వ తేదీన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితరులకు ఇంటి దగ్గరకు వెళ్లి పింఛన్ సొమ్ము, ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ చేపట్టారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా మన రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాల్లో మెరుగైన వైద్యం పొందేలా చేశారని తెలిపారు. పంటల సాగుకు పెట్టుబడిసాయం, ఆసరా, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ ఋణాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దక్కుతుందన్నారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్ల కేశన్న, ఎంపీటీసీ సుశీలమ్మ, ఎంపీడీవో బంగారమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందురాజులు, పెద్ద నర్సిరెడ్డి, వడ్డె హనుమంతు, గడ్డం తాయన్న, గడ్డం తిక్కన్న, సాయినాథ్‌రెడ్డి, ఉద్యోగులు, వాలంటీర్లు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



ఓ కుటుంబానికి ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జగన్‌మోహన్‌రెడ్డి